సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 7 । మార్చి । 2024



మహిళలకు 'చేయూత'

వైఎస్‌ఆర్ చేయూతకు రంగం సిద్ధమైంది. నేడు 1,75,225 మంది మహిళల బ్యాంకు ఖాతాలకు రూ.328.54 కోట్లు జమ చేయనున్నారు. - 8లో



వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం

చంద్రబాబుది బీసీ వ్యతిరేక భావజాలమని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. - 8లో

వ్యవసాయ రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

బొలాకి: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా వ్యవసాయ రుణాలు పొందిన రైతులు ఈ నెల 28లోగా రెన్యువల్ చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం కంటే ఎక్కువ కాల పరిమితి కలిగిన రుణాలకు గరిష్ట వడ్డీ రేట్లు వర్తిం చేక్రమంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా రెన్యువల్ వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

ముగిసిన టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఆన్‌లైన్ పద్ధతిలో గత నెల 27న ప్రారంభమైన ఏపీ టెట్–2024 పరీక్షలు బుధవారంతో ముగిశాయి. రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, చివరి రోజు ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100 మందికి 94 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 94 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 116 మందికి 105 మంది, రెండో షిఫ్టులో 107 మందికి 98 మంది హాజరయ్యారు. మొత్తం 3291 మందికి గాను 3005 మంది హాజరయ్యారు. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

మల్లన్న తలపాగా ఊరేగింపు



తలపాగాను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

ఆమదాలవలస రూరల్ : మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో చేనేత కార్మికుల ఆధ్వర్యంలో శ్రీశైలం మల్లికార్జునస్వామి కోసం నేసిన తలపాగాను బుధవారం ఊరేగించారు. మహా శివరాత్రి నాడు శ్రీశైలం మల్లన్నకు సమర్పించేందుకు 182.5 మీటర్ల తలపాగాను మగ్గంపై నేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు నమ్మి ప్రజలు ఎక్కువగా మోసపోతున్నారని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు ఎస్పీ కొన్ని సూచనలు చేశారు. కొంతమంది నేరుగా ఫోన్ చేసి కొరియర్‌లో డ్రగ్స్ బుక్ చేశారని, మీ చిరునామాకు మాదకద్రవ్యాలు వచ్చాయని, తాము ముంబై, ఢిల్లీ నార్కోటిక్ పోలీసులమంటూ నమ్మించడానికి వీడియో కాల్ చేస్తారని, మనపై కేసు లేకుండా ఉండాలంటే కొంత నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తారని, అలాంటి ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. ఆన్‌లైన్ జాబ్స్ పేరిట ఉద్యోగం ఆశ చూపే మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. పార్ట్‌టైం జాబ్స్ పేరిట వచ్చే లింక్స్ క్లిక్ చేయకూడదని చెప్పారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవుపలికారు. సైబర్ మోసానికి గురైతే హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు తక్షణమే సంప్రదించాలని సూచించారు. నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జిఒవి.ఇన్‌లో ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ పేర్కొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

నరసన్నపేట: పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని డీఈఓ ఏ.వెంకటేశ్వరరావు అన్నారు. నరసన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత(బోర్డు) పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక సూచనలిచ్చారు. పరీక్షలంటే భయం వీడాలని, ఒత్తిడికి గురి కాకుండా ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు డీబార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు–2024 పకడ్బందీగా కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. బుధవారం మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను డీబార్ చేశారు. పాతపట్నం కిరణ్మయి జూనియర్ కళాశాలలో సివిక్స్ పేపర్–1లో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడుతున్న విద్యార్థిని ఫ్లయింగ్ స్క్వాడ్ బి.వి.రమణమూర్తి పట్టుకున్నారు. నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో సివిక్స్ పేపర్–1, ఒకేషనల్ పేపర్–1లో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడుతున్న ఇద్దరిని ఆర్‌ఐఓ పి.దుర్గారావు, డీఈసీ–1 బి.శ్యామ్‌సుందర్, డీఈసీ–2 జి.సింహాచలంకు పట్టుబడ్డారు. జిల్లా స్పెషల్ ఆఫీసర్/డీవీఈవో కోట ప్రకాశరావు, ఆర్ఐఓ, డీఈసీ కమిటీ, ఫ్లయింగ్, సిట్టింగ్ బృందాలు వేరువేరుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటికే నాలుగు సిట్టింగ్ స్క్వాడ్‌లు ఉండగా 6వ తేదీ నుంచి ఇంటర్ బోర్డు అనుమతితో అదనంగా రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించిన విషయం తెలిసిందే.

శివం.. సుందరం



శివరాత్రికి శైవ క్షేత్రాలు సిద్ధం

- శ్రీముఖలింగం, రావివలస ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కేంద్రంలో ముస్తాబైన చారిత్రక శివాలయాలు
- పుణ్యక్షేత్రాలకు, పంచారామాలు, మహేంద్ర గిరులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మహాశివరాత్రికి శివాలయాలు సిద్ధమయ్యాయి. జిల్లాలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన శ్రీముఖలింగం, రావివలస ఆలయాలతో పాటు శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం తదితర శైవక్షేత్రాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ సైతం ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు సిద్ధం చేసింది.

ముక్తికి మార్గం.. శ్రీముఖలింగం

జలుమూరు: ఎక్కడైనా శివుడు లింగాకారంలో దర్శనమిస్తుంటాడు. దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగంలో మాత్రం ముఖం ఆకృతి దాల్చి ఆవిర్భవించాడు. అందుకే ఈ క్షేత్రానికి శ్రీముఖలింగమని, ఇక్కడ కొలువైన శివుడిని ముఖలింగేశ్వరుడని పిలుస్తారు. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీముఖలింగంలో మూడు ప్రధాన ఆలయాలతోపాటు ఎన్నో శివలింగాలు ఉన్నాయి. కోటికి ఒక్కటి తక్కువగా ఉండటం వల్ల కాశీగా పేరొందాల్సిన శ్రీముఖలింగం దక్షిణ కాశీగా మిగిలిపోయిందని అర్చకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆలయ గర్భగుడిలోని గోలెంను తాకి కోరుకుంటే మొక్కులు తీరుతాయని భక్తుల నమ్మకం. ప్రధాన ఆలయానికి తూర్పుదిక్కున భీమేశ్వరాలయం, దక్షిణ దిశలో ఉన్న సోమేశ్వరాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ జరిగే మహా శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివస్తారు. ఈ నెల 8న శివరాత్రి, 9న పడియా, 10న మహాపడియా, 11న స్వామి వారి చక్రతీర్థ స్నానాలు జరుగుతాయని ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు.



పూజలు అందుకుంటున్న స్వామివారి స్వయంభూ లింగం

ఆధ్యాత్మిక సిరులు.. మహేంద్రగిరులు



పరశురాముడి విగ్రహం

మందస: ఏడాది పొడవునా నిశ్శబ్దంగా ఉన్న గిరుల్లో శివరాత్రి సందర్భంగా మూడు రోజులు మాత్రం ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోతుంది. హేభిమ్మో... హేభిమ్మో... అంటూ పచ్చని అరణ్యం మధ్య నుంచి భక్తుల జనఘోష వినిపిస్తుంటుంది. దట్టమైన ఆంధ్రా–ఒడిశా అడవుల మధ్య ఉన్న మహేంద్రగిరికి కొండంత భక్తితో భక్తులు తరలివస్తారు. దక్షిణ భారతదేశంలో తూర్పు కనుమలు అతి ఎత్తయిన శిఖరం మహేంద్రగిరులు. పెద్ద పెద్ద వృక్షాలు, లోతైన లోయలు, అమూల్య ఔషధ మూలికలతో కూడిన దట్టమైన అటవీ ప్రాంతం. తూర్పు కనుమల్లోని గంజాం జిల్లా ఒడిశా–ఆంధ్రా సరిహద్దులో విస్తరించి ఉన్నాయి. సముద్రమట్టానికి సుమారు 5వేల అడుగుల ఎత్తులో ఉంది. మహాశివరాత్రి సందర్భంగా మహేంద్ర గిరులపై మూడు రోజుల పాటు జరిగే యాత్రకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. శ్రీకాకుళం జిల్లా మందస గ్రామానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. భక్తులు మజిలీ చేసుకుని కేవలం కాలినడకనే గిరులపై ఉన్న ఆలయాలను చేరుకుంటారు. సుందరమైన ప్రకృతిని చూసి తన్మయత్వం చెందుతారు. మహేంద్రగిరులపై పంచ పాండవులు నిర్మించినట్లు చెబుతున్న ఆలయాలు దర్శనమిస్తాయి. క్రూర మృగాలకు నెలవైన మహేంద్రగిరుల శివరాత్రి నాడు వచ్చే భక్తులకు ఎటువంటి హాని చేయకపోవడం విశేషం. అర్జునుడు మనోవేగం కలవాడై, ఇంద్రనేర పర్వతం చేరి, ఇంద్రుని సాక్షాత్కారం పొంది, సర్వేశ్వరుని అనుగ్రహానికి మహాగిరి వచ్చాడని, ఆ మహాగిరే మహేంద్రమని పురాణాలు చెబుతాయి.



కుంతీ కోవెల వద్ద భక్తులు

ఎలా వెళ్లాలి..

పలాస రైల్వే స్టేషన్‌లో దిగాలి. అక్కడి నుంచి మందస మీదుగా సాబకోట వరకు పలాస ఆర్టీసీ డిపో బస్సులు నడుపుతుంది. సాబకోట నుంచి మహేంద్రగిరులకు కాలినడకను మాత్రమే వెళ్లగలరు. రాజులు బస చేసే ప్రాంతాన్ని రాజబసగా పిలుస్తారు. రాజబస వరకు ద్విచక్ర వాహనాలు, జీపులు, టక్కర్లు కష్టమ్మీద వెళ్తాయి. కాగా, ఒడిశాలోని కొయిపూర్ మీదుగా గిరులపైకి దారిని ప్రభుత్వం నిర్మించింది.

కలియుగ కైలాసం.. ఎండల మల్లన్న క్షేత్రం



టెక్కలి: ప్రపంచంలోనే ఎత్తయిన స్వయంభూలింగం వెలిసిన టెక్కలి మండలం రావివలస గ్రామంలోని ఎండల మల్లికార్జున స్వామి ఆలయం కలియుగ కైలాసంగా పేరుగాంచింది. ఈ నెల 8 నుంచి 11 వరకు మల్లన్న సన్నిధిలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఈఓ వి.రాధాకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, ఎంపీటీసీ మన్నేల కిషోర్‌తో గ్రామస్తుల పర్యవేక్షణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎలా వెళ్లాలి..

ఈ ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుని అక్కడ నుంచి 4 కిలోమీటర్ల దూరంలో గల ఈ ఆలయానికి చేరుకునేందుకు బస్సులు, ఆటోల సదుపాయం ఉంది. రైల్వే మార్గం విషయానికి వస్తే టెక్కలితో పాటు సమీపంలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నౌపడ రైల్వే స్టేషన్, 20 కిలోమీటర్ల దూరంలో పలాస రైల్వే స్టేషన్‌కు రైల్వే మార్గంలో చేరుకుని అక్కడి నుంచి బస్సులు, చిన్నపాటి వాహనాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు



విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలో పలు శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు రంగం సిద్ధం చేశారు. శ్రీముఖలింగం, రావివలస, సాబకోట, రామతీర్థం తదితర ప్రాంతాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 8, 9 తేదీల్లో శ్రీకాకుళం 1, 2 డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల నుంచి రామతీర్థ క్షేత్రానికి 26 ప్రత్యేక బస్సులు, టెక్కలి నుంచి రావివలసకు 6 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. శ్రీకాకుళం రెండవ డిపో నుంచి శ్రీముఖలింగానికి ప్రతి రోజూ 6 బస్సులు తిరుగుతున్నాయి. వీటితో పాటు భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు నడుపుతారు. పలాస నుండి సాబకోటకు 45 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. పాత్తంగికి 7బస్సులు నడపనున్నారు. శ్రీముఖలింగంలో చక్రతీర్థ స్నానం సందర్భంగా 11న అదనంగా 12 బస్సులు నడపనున్నట్లు డీపీటీఓ ఎ.విజయకుమార్ తెలిపారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



భక్తి ప్రాకారం... నాగావళి తీరం



భక్తుల కోసం క్యూ ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని చారిత్రక శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. శ్రీకాకుళం పట్టణంలో నాగావళి తీరంలో గుడివీధిలో ఉన్న ఉమా రుద్రకోటేశ్వరాలయం అత్యంత పురాతనమైనది. ద్వాపర యుగాంతంలో బలరాముడిచే ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతాన్ని గతంలో రుద్రకోటేశ్వర అగ్రహారం అనే వారు. బలరామ ప్రతిష్ఠతములైన పంచలింగాల ప్రాంతం కావడం వల్ల పంచలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ సుకన్య, అర్చకులు శ్రీరామమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నదిలో స్నానాలు చేసేందుకు వీలుగా మున్సిపల్ సిబ్బంది సహకారంతో నదీ ప్రాంతాన్ని పరిశుభ్రం చేస్తున్నారు. ఈ ఆలయంతో పాటు కొన్నావీధిలో సుమారు 250 ఏళ్ల చరిత్ర కలిగిన భీమేశ్వరాలయం, 300 ఏళ్ల చరిత్ర కలిగిన గుజరాతిపేటలోని ఉమా లక్ష్మేశ్వర స్వామి ఆలయం, నక్కవీధిలోని ఉమాజలలేశ్వరస్వామి ఆలయం, బలగలోని ఉత్తరేశ్వర శివలింగం, పాత శ్రీకాకుళంలోని కాశీ విశ్వేశ్వర ఆలయం, కాకివీధిలోని జీవేశ్వరస్వామి ఆలయం, పీఎస్.కాలనీలో మృత్యుంజయేశ్వర ఆలయం, బ్యాంకర్స్ కాలనీలోని శివబాలాజీ ఆలయాలు శివరాత్రికి ముస్తాబవుతున్నాయి.

అచ్చెన్నాయుడికి ఎదురుదెబ్బ

- టీడీపీ కంచుకోట కన్నేవలస నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన కన్నేవలస గ్రామస్తులు

కోటబొమ్మాళి: గత నలభై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న కోటబొమ్మాళి మండలం కన్నేవలస గ్రామంలో టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు బుధవారం ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే అచ్చెన్నాయుడికి భారీ ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది. అచ్చెన్నకు మద్దతుగా నిలుస్తూ వచ్చిన టీడీపీ నాయకులు పంగ యోగేశ్వరరావు, ఈది రామారావు, మట్ల ఆదినారాయణ, సూరపు మల్లేసు, పాగోటి దుర్గారావు, ఈదు వీరాస్వామి, సూరపు సింహాచలం, తూలుగు అప్పన్న, మెండ రమణ, సూరపు వేణుగోపాలరావు, ఎచ్చెర్ల సిమ్మన్న తదితర 50 కుటుంబాలు కొత్తపేటలోని రెడ్డి కల్యాణ మండపం వేదికగా జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కండువాలు వేసుకున్నారు. కన్నేవలసలో నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధి జరగలేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన నచ్చి వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం దువ్వాడ మాట్లాడుతూ అచ్చెన్నాయుడి ఓటమికి ఇది తొలి సంకేతమని, రాబోయే రోజుల్లో మరింత మంది పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రోణంకి మల్లేశ్వరరావు, బాడాన మురళీధర్, నూక సత్తిరాజు, నేతింటి అప్పలస్వామి, బొడ్డు అప్పన్న, ఎన్ని మన్మధరావు, జి.కేశవరావు, సుంకరి జనార్దన, జి.నాగభూషణరావు, మెట్ట ఢిల్లేశ్వరరావు, నేతింటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

661 మంది రైతులకు రూ.32.21 లక్షలు

- ఇన్‌పుట్ సబ్సిడీ కింద జమ
- హర్షం వ్యక్తం చేసిన అన్నదాతలు



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : జిల్లాలో 2023–24 రబీ సీజన్(డిసెంబర్)లో మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన 661 మంది రైతులకు బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.32.21లక్షలను జమ చేశారు. వెలగపూడిలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అర్హులైన రైతన్నలకు బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ గత సీజన్‌లో 661 మంది రైతులకు గాను రూ.32.21 లక్షలతో కలిపి ఈ ఐదేళ్లలో వివిధ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన 27633 మంది రైతులకు రూ.960 లక్షల మేర ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసినట్లు వివరించారు. ప్రభుత్వం ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటుందని చెప్పారు.ఈ– క్రాప్ ఆధారంగా పంట నష్టాలను అంచనా వేస్తూ గ్రామ సచివాలయాల్లో అర్హుల జాబితా ప్రదర్శించి పారదర్శకంగా ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు పంట నష్టపరిహారం నమూనా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు కె.శ్రీధర్, జిల్లా అగ్రికల్చరల్ అడ్వైజరీ చైర్మన్ నేతాజీ, డి.సి.ఎం.ఎస్. చైర్మన్ గొండు కృష్ణ, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

నిజరూప దర్శనం..పులకించిన భక్తజనం

- నయనానందకరంగా వాసుదేవుని అభిషేకం



వాసుదేవుని నిజరూపం

మందస: పండితుల వేదమంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాలు.. జైశ్రీమన్నారాయణ మంత్రజపాలతో మందసలోని వాసుదేవస్వామి ఆలయం మార్మోగింది. త్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో స్వామికి అభిషేక మహోత్సవం బుధవారం కన్నుల పండువగా సాగింది. నిజరూప దర్శనంతో భక్తులు తన్మయత్వానికి గురయ్యారు. బ్రహ్మోత్సవాలు చివరి రోజు కావడంతో భక్తులు పోటెత్తారు. త్రిదండి అహోబిలరామానుజ జీయర్ స్వామి, ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణలతో ఉదయం 9 గంటల నుంచి వాసుదేవుని నిజరూపానికి అభిషేకం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ నుంచి లోతుగెడ్డ సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: పాతపట్నం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావును పార్టీ నుంచి అధిష్టానం సస్పెండ్ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు బుధవారం రాత్రి జారీ అయ్యాయి. పార్టీలో ఉంటూ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్రమశిక్షణా కమిటీ సిఫారసుల మేరకు సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్నికల కమిషన్ సూచనలు పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల కమిషన్ సూచనలను శతశాతం తూచా తప్పకుండా పాటించాలని, ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, రూట్‌లపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సెక్టార్ పరిధిలో ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రూట్ మ్యాప్ తయారు చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలను, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. కమ్యూనికేషన్ మ్యాపింగ్ తయారు చేసి అత్యవసర విధులకు హాజరవుతున్న వారి ఫోను నంబర్లను కలిగి ఉండాలన్నారు. ఎస్పీ జి.ఆర్ రాధిక మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెక్టార్ అధికారులతో కలిసి పోలీసులు ప్రతి గ్రామాన్ని సందర్శించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు పోలింగ్ రోజున అన్ని కేంద్రాలకు నియమావళి ప్రకారం సామగ్రి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, శిక్షణ తరగతుల నోడల్ అధికారి బాలాజీ, మాస్టర్ ట్రైనర్ శేషగిరి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ త్రినాథరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోంగార్డుకు రూ.4.22 లక్షల చెక్ అందజేత



అప్పారావుకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖలో హోం గార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొవ్వూరు అప్పారావుకు ఎస్పీ జి.ఆర్.రాధిక రూ.4.22 లక్షల చెక్కును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. అప్పారావు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం ఉదయం ఘనంగా జరిగింది. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమూర్తులుగా అనివేటి మండపంలో కొలువుదీర్చారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణం జరిపించారు. కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీముఖలింగం ఆలయ పాలక మండలి ఏర్పాటు



బి.వి.రమణ

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగం ఆలయానికి పాలక మండలిని ఏర్పాటు చేస్తూ దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ నియామకానికి కూడా ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. శ్రీముఖలింగం ఆలయ చైర్మన్‌గా బి.వి.రమణ, సభ్యులుగా ఎస్.కృష్ణవేణి, వై.బాలమ్మ, కె.పండా, జి.సరోజిని, జె.గోపి, ఎన్.స్వాతి, వి.సంతోషి, ఎల్.రమేష్ గుప్తా, బి.వి.సుబ్బారావులను నియమించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ సభ్యులుగా అరుణ్‌కుమార్ దాస్, పి.అప్పలనాయుడు, ఎల్.రామయ్య, వి.పరమేశ్వరి, టి.భాగ్యం, ఎస్.దేవి, ఎన్.ఉగాది, విశ్వనాథ్‌దాస్ నియమితులయ్యారు. తనను పలక మండలి చైర్మన్‌గా ఎంపికకు కృషి చేసినందుకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, బీసీ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మ ప్రియమ్మ, ఎంపీపీ వాన గోపి తదితరులకు బసవ వెంకట రమణ కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌సీఐకి లెవీ బియ్యం చెల్లించాలి



మాట్లాడుతున్న అధికారులు

నరసన్నపేట: జిల్లాలో మిల్లర్లు ఎఫ్‌సీఐకి లెవీ బియ్యాన్ని నెలాఖరులోగా చెల్లించాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ కె.శ్రీనివాస్ ఆదేశించారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో మిల్లర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మిల్లర్ల నుంచి 40 వేలు మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జేసీ నవీన్ ఆదేశాల మేరకు మిల్లర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మిల్లర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు జెడ్పీలో ఎన్నికల వర్క్‌షాపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పారదర్శక అనుబంధ (సప్లిమెంట్) ఓటర్ల జాబితాల రూపకల్పనకు యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ మనజిర్ జిలానీ సమూన్ అన్నారు. అనుబంధ ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, రానున్న 2024 ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ ఎం.నవీన్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పొలిటికల్ పార్టీలు, మీడియా ప్రతినిధులతో గురువారం ఉదయం జిల్లా పరిషత్‌లో ప్రత్యేక వర్క్‌షాపు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సీ సెక్షన్ సూపరింటెండెంట్ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 'చేయూత'

- నేడు వైఎస్సార్ చేయూత నిధుల జమ
- జిల్లాకు నాలుగో విడతలో రూ.328.54 కోట్లు కేటాయింపు
- 1,75,225 మంది మహిళలకు లబ్ధి



శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. అందులో ఒకటి వైఎస్సార్ చేయూత. నడి వయసు మహిళల ఆర్థికాభ్యున్నతికి తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల వయసు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ వర్గాల మహిళలకు ఈ పథకం ద్వారా ఏటా రూ.18,750 బ్యాంకు ఖాతాలో జమచేస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో నగదు జమ చేశారు. ఈ మొత్తంతో మహిళలు స్వయం శక్తిగా ఎదగడంతో పాటుగా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. చిన్న చిన్న దుకాణాలు, పాడి పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని చేయూత నిధులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రతి ఏటా నిధులు రావడంతో పెట్టుబడికి లోటు లేకుండా ఉంది. ఆర్థిక భారం, అప్పుల బాధ లేకుండా పేద, మధ్య తరగతి కుటుంబాలు సంతోషకరమైన జీవనం గడుపుతున్నారు.

మొదటి విడత..
జిల్లాలో 30 మండలాలు, 4 పురపాలక సంఘాల పరిధిలో 1,54,490 మంది మహిళలకు గాను రూ.280.57 కోట్లు ప్రయోజం చేకూర్చుతూ వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

రెండో విడత..
జిల్లాలో 30 మండలాలు, 4 పురపాలక సంఘాలు పరిధిలో 1,59,968 మంది మహిళలకు గాను రూ.290.83 కోట్లు ప్రయోజం చేకూర్చుతూ వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

మూడో విడత..
జిల్లాలో 30 మండలాలు, 4 పురపాలక సంఘాలు పరిధిలో 1,75,592 మంది మహిళలకు గాను రూ.320.15 కోట్లు ప్రయోజనం చేకూర్చుతూ వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేశారు.

నాలుగో విడత..
నాలుగో విడతకు ప్రభుత్వం సిద్ధమైయింది. జిల్లాలో 1,75,225 మంది లబ్ధిదారులకు గాను రూ.328.54 కోట్లు అందజేయనున్నారు. ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నగదును మహిళల వ్యక్తిగత ఖాతాల్లో రూ.18,750 చొప్పున జమ చేయనున్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

సర్వం సిద్ధం..

వైఎస్సార్ చేయూత నాలుగో విడతకు సిద్ధమయ్యాం. ఇప్పటికే అర్హుల జాబితాలు సిద్ధం చేసి పరిశీలన కూడా పూర్తయ్యింది. ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల వ్యక్తిగత ఖాతాల్లో ఒకొక్కరికి రూ.18,750 వంతున జమచేయనున్నారు.

– డాక్టర్ వి.వి.విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం

- బీసీ వ్యతిరేక భావజాలం ఉన్నది చంద్రబాబుకే
- పనిముట్లు ఇవ్వడమే సామాజిక న్యాయం కాదు
- మీడియా సమావేశంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు దొంగ మాటలు చెప్పినంత మాత్రాన సామాజిక న్యాయం జరగదని, ప్రభుత్వాలు బీసీల జీవన ప్రమాణాలు పెరిగే దిశగా సంక్షేమాన్ని అందించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్‌లో బుధవారం విలేకరులతో మంత్రి మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల కోసం మభ్యపెట్టే హామీలు ఇస్తారే తప్ప స్వతహాగా బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌కు సామాజికంగా ఎదగాలన్న ఆలోచన ఆయనకు లేదన్నారు. 14 ఏళ్ల సీఎంగా, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ఆయన భావజాలం పరిశీలిస్తే ఏనాడూ బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం ఇవ్వడానికి ఇష్టపడలేదన్నారు. రాజ్యసభకు ఇప్పటిదాకా ఒక్క బీసీని కూడా పంపించని ఆయన బీసీలకు అధికారం ఇస్తారంటే ఎవరైనా నమ్ముతారా ? అని ప్రశ్నించారు. రాజ్యాధికారం ఇవ్వకుండా జయహో బీసీ ఎలా అవుతుందన్నారు. బీసీలకు ఎవరు ఎక్కువ న్యాయం చేశారోనన్న విషయంపై వైఎస్సార్‌సీపీకి, టీడీపీకి డిబెట్ పెడితే మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి నలుగుర్ని రాజ్యసభకు పంపించారని గుర్తుచేశారు.

ఎన్నికల వరకే..
ఈ ఐదేళ్లలో రాజ్యాంగ బద్ధంగా బీసీల ఎదుగుదలకు రాజ్యాధికారం ఇచ్చి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలిగించి సామాజిక న్యాయం అందించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని మంత్రి చెప్పారు. ఎన్నికలు వచ్చినప్పుడు జయహో బీసీ, ఎన్నికలు అయిపోయాక అసలు బీసీలను పట్టించుకోకపోవడం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నిక అయిపోగానే డిక్లరేషన్ల ఊసే ఉండదన్నారు. ఆరుగురు లోక్ సభ్యులు, నలుగురు రాజ్యసభ సభ్యులు, పన్నెండు మంది మంత్రులు, 56 కార్పొరేషన్ చైర్మన్లు ఇచ్చి బీసీల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని చెప్పారు. పాల వ్యాపారులకు డబ్బా, సైకిల్ ఇచ్చి మీ బొమ్మలు వేస్తే సామాజిక స్థితిగతులు మారవని, ఆర్థికంగా చేయూతనిచ్చి రాజ్యాధికారం కల్పించాలని చెప్పారు. ఈ ఐదేళ్లలో డీబీటీ పద్ధతిలో బీసీలకు రూ 1.22 లక్షల కోట్లు అందించామని వివరించారు.

వృత్తుల వారికి గౌరవం..
నాయిబ్రాహ్మణులను అగౌరవ పరిస్తే అట్రాసిటీ కేసులు నమోదు చేసేందుకు వీలుగా చట్టాన్ని సవరించామని, టీటీడీ ట్రస్ట్ బోర్డులో మెంబర్ అవకాశం కల్పించామని మంత్రి చెప్పారు. శెట్టి బలిజల్లో రాజ్యసభ సభ్యుడున్నారని, యాదవులకు పెద్ద ఎత్తున పార్లమెంట్ సీట్లు, అసెంబ్లీలో ఎన్నడూ లేనివిధంగా బ్యాక్‌వర్డ్ క్లాసెస్‌కు సీట్లు ఇచ్చామని తెలిపారు. చంద్రబాబు ఎప్పుడు ధనవంతులను ఎంపిక చేసే పనిలోనే ఉంటారు తప్ప బీసీ నాయకులను ఎప్పుడూ గుర్తించలేదన్నారు. సంక్షేమ పథకాల అమలుఓ ఈ రాష్ట్రం మరో శ్రీలంక, వెనెజులా అవుతుందని, దివాలా తీసేస్తుందని చంద్రబాబు వ్యాఖ్యానించారని, వాస్తవానికి భారత ప్రభుత్వం ప్రకటించిన సూచీలు గమనిస్తే జీడీపీలో అధికంగా వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. పథకాలపై మళ్లీ మాట మార్చి రాజమండ్రిలో సభలో ఇంత కన్నా ఎక్కువ ఇస్తానని చెప్పడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. మీరు చెప్పే మాటలన్నీ ఎన్నికల్లో ఓటుకోసమే తప్ప మరొకదానికి కాదన్నారు. ఎన్నికల ముందు గొప్ప ప్రసంగాలు ఇచ్చినంత మాత్రాన మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని మంత్రి స్పష్టం చేశారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం



పాతపాడులో వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని, గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాకారం చేశారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పాతపాడులో వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం, విజయరాంపురంలో ఆర్బీకే, సచివాలయం, ఆరోగ్య కేంద్రం, చిగురువలసలో ఆర్బీకే, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం భవనాలను బుధవారం స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించినప్పుడే సమాజం అగ్రగామిలో పయనిస్తుందనే ముందుచూపుతో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, ఏఎంసీ చైర్మన్ బెవర కృష్ణవేణి, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, మండల సచివాలయాల కో–ఆర్డినేటర్ అత్తులూరి రవికాంత్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, విజయరాంపురం, యరగాం సర్పంచ్‌లు బెండి అప్పలనాయుడు, రావాడ వాగ్దేవి, పార్టీ నేత అత్తులూరి మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం రూ.1,32,847

టెక్కలి: మండలంలోని రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం హుండీ కానుకల ఆదాయం లెక్కించారు. 85 రోజులకు గాను రూ.1,32,847 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్ ఈఓలు వి.రాధాకృష్ణ, టి.మనస్వి, భక్తులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓగా బాబూరావు



డీఎంహెచ్‌వో మీనాక్షిని కలిసిన ఏఓ

అరసవల్లి : జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయ పరిపాలనాధికారిగా ఆర్.బాబూరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన స్థానిక రిమ్స్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఏఓగా పదోన్నతితో ఇక్కడ విధుల్లోకి చేరారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శివకుమార్‌కు పరిపాలన (అడ్మిన్) విభాగ సూపరింటెండెంట్‌గా కూడా బాధ్యతలు అప్పగించినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఇక్కడ అడ్మిన్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన భాస్కర్‌కుమార్ ఇటీవలే వివిధ ఆరోపణల కారణంగా విధుల నుంచి సస్పెండ్ అయిన సంగతి విదితమే. ఇందుకు కారణమైన హెల్త్ అసిస్టెంట్ల నియామకాలకు సంబంధించి ఆరోపణలపై వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయ ఉన్నతాధికారులతో విచారణ కొనసాగుతోంది.

'బీసీలకు ద్రోహం చేస్తున్న శిరీష'



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాశీబుగ్గ: బీసీల సమస్యలపై మాట్లాడే అర్హత పలాస టీడీపీ నాయకురాలు శిరీషా చౌదరికి లేదని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. బుధవారం పలాసలోని మంత్రి అప్పలరాజు క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లో పలాస టికెట్ పొందేందుకు గౌతు శిరీషాగా వ్యవహరిస్తూ.. విశాఖపట్నంలోని సొంతింటికి వెళ్లినప్పుడు మాత్రం యార్లడగ్గ శిరీషా చౌదరిగా మారిపోతున్నారని దుయ్యబట్టారు. శిరీషాకు టీడీపీ టికెట్ కేటాయించడంపై సొంత పార్టీలోనే విమర్శలు ఎదురవుతున్నాయని, ఇంతకీ ఆమె ఓసీ కేటగిరినా లేక బీసీ కేటగిరీనా స్పష్టం చేయాలన్నారు. గౌతు లచ్చన్న స్ఫూర్తిని శిరీషా చౌదరి కాలరాస్తూ బీసీ ముసుగు వేసుకుని పలాస ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన యార్లగడ్డ వెంకన్న చౌదరి బీసీ ఎలా అవుతారని ప్రశ్నించారు. కమ్మ కార్డు పట్టుకుని టికెట్ సంపాదించుకుని పలాస ఓటర్ల వద్ద మీ బీసీ పిల్లను అంటూ పిల్లి మొగ్గలు వేసే కుటిల బుద్ధి బయటపడిందన్నారు. శిరీషా చౌదరి వల్ల ఎంతో మంది బీసీలు రాజకీయంగా ఎదగలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, పట్టణ అధికార ప్రతినిధులు శిష్టు గోపి, గుజ్జు జోగారావు, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్, జిల్లా కార్యదర్శి బడగల బల్లయ్యానాయుడు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, కో–ఆప్షన్ మెంబర్ బమ్మిడి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు, జిల్లా కార్యదర్శి సాధు శ్రీను

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. విశాఖపట్నం ఏయూ ఇంజినీరింగ్ క్రీడామైదానం వేదికగా ఈ నెల 3 నుంచి 5 వరకు 70వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు, రాష్ట్ర కబడ్డీ సంఘ ప్రతినిధుల చేతుల మీదుగా జిల్లా క్రీడాకారులు ట్రోఫీ, పతకాలను అందుకున్నారు. అత్యద్భుత ఆటతీరుతో రాణించిన జిల్లా క్రీడాకారులు ఎస్.శంగలరావు (సింగుపురం–శ్రీకాకుళం రూరల్), ఎం.మణికంత (పాలకొండ) జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు మహారాష్ట్రలో మార్చి మూడో వారంలో జరగనున్నాయి. వీరిని జిల్లా కబడ్డీ జట్టు రాణింపు పట్ల జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సీదిరి అప్పలరాజు, అధ్యక్షుడు ధర్మాన రామలింగంనాయుడు, కార్యదర్శి సాదు శ్రీనివాసరావు, ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షులు దర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, పోలినాయుడు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు తదితరులు అభినందించారు.

లారీ ఢీకొని ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి



ఘటనా స్థలంలో ముకుందరావు మృతదేహం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని వంజంగి–వాకలవలస రహదారిలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ చింతాడ ముకుందరావు (57) మృతి చెందారు. ఈయన ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో నివాసముంటున్నారు. ఆమదాలవలసలో విధులు ముగించుకుని శ్రీకాకుళం వస్తుండగా ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి మరో లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముకుందరావుకు భార్య ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత సీట్లను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 12(1)సి ప్రకారం రాష్ట్రంలో ప్రైవేటు, అన్–ఎయిడెడ్ కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్(ఏపీసీ) డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సెక్టోరియల్ అధికారులతో కలిసి బుధవారం నోటిఫికేషన్ పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద, బడుగు, బలహీన వర్గాలు, ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా కేటాయించిందని చెప్పారు. ఈ నెల 5 నుంచి 25 వరకు సీఎస్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో ఐదేళ్లు నిండిన పిల్లల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు ఐదు శాతం , ఎస్సీ వర్గాలకు పది శాతం, ఎస్టీ వర్గాలకు నాలుగు శాతం, బీసీ, మైనారిటీ, ఓపెన్ కాంపిటీషన్ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆరు శాతం సీట్లు.. ఇలా మొత్తం పాఠశాలలో ఉన్న సీట్లలో 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయిస్తారని వివరించారు. ఫీజులు, ఇతరత్రా అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత పాఠశాలకు చెల్లిస్తుందని చెప్పారు. ఐబీ సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్ బోధించే పాఠశాలల్లో ప్రవేశాలకు 2 జూన్ 2017 నుంచి 31 మార్చి 2018 మధ్య జన్మించిన వారు, స్టేట్ సిలబస్ బోధిస్తున్న పాఠశాలల్లో ప్రవేశాలకు 2 జూన్ 2017 నుంచి 31 మే 2018 మధ్యలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు.

• ముగిసిన వైబ్రెంట్ విస్టా



ఫ్లాష్‌మాబ్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులుగా నిర్వహించిన వైబ్రెంట్ విస్టా 2కె24 టెక్నికల్ ఫెస్ట్ బుధవారంతో ముగిసింది. విద్యార్థులు వర్సిటీ ప్రధాన ద్వారం ముందు ప్రదర్శించిన ఫ్లాష్ మాబ్ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్